మంచి సంబంధం ఒకటి వచ్చిందనీ, అమ్మాయిని చూసేందుకు రమ్మనీ, వచ్చే ముందు ఉత్తరం రాయమనీ తండ్రి జగన్నాథం నుంచి ఉత్తరం వచ్చింది వసంత్‌కి. శ్వేతకి చూపించాడు దాన్ని. చదివి నవ్వింది.

''చూసి రాపో''

''వేళాకోళమా'' నెత్తిమీద మొట్టికాయ వేశాడు.

నాల్గునెలల మూడు వారాల నుంచీ ఇద్దరూ కలిసి వుంటున్నారు. ''ఆడా-మగా కలిసి జీవించడానికి పెళ్ళి అవసరమా'' అంటాడు వసంత్. ''పెళ్ళి కాకుండా ఎట్లా సాధ్యమవుతుంది?'' అంది మొదట్లో శ్వేత. అయితే ఆమెకి నాల్గు నిమిషాల్లాగే గడిచిపోయాయి ఈ నాల్గు నెలలు. ప్రేమలో వుండే మాధుర్యం రుచి చూస్తున్నారు, సెక్స్ తప్పించి. శ్వేత ఇంకా స్టూడెంటే. ఒక రాత్రి బాగా టెంప్ట్ అయి సెక్స్ కావాలన్నాడు వసంత్.

''తప్పదా. కనీసం పరీక్షలయినదాకా అయినా ఆగుతావనుకున్నా'' అంది అతడి ఆవేశానికీ, బాధకీ చలిస్తూ.

ఆమె మొహం వంక చూసి కంట్రోల్ చేసుకున్నాడు.

''పరీక్షలయ్యేంతవరకూ దీనితోనే తృప్తి పడతాను'' అని పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు. రక్తం పోరు పెడుతుంది. నరాలు గిలగిలా కొట్టుకుంటాయి. దేహాలు ఏదో కావాలంటాయి. కళ్ళు ఏమేమో చెప్పుకుంటుంటాయి. అయినా ఏదో అడ్డు తగుల్తుంటుంది. ఆగిపోతారు. కావలింతలతో, ముద్దులతో తృప్తి పడుతున్నారు. ఆమె ఫైనలియర్‌లో ఉంది. ఎం.ఏ సోషియాలజీ చేస్తోంది. ఇంకెంతకాలమనీ. రెండు నెలలు ఓపిక పడితే చాలు. కానీ ఆ రెండు నెలలు తనకి రెండు యుగాలుగా వుంటుందనుకుంటాడు వసంత్.

పెళ్ళి కాకుండా ఓ ఆడదీ - ఓ మగాడు కలిసి వుంటున్నారంటే లోకానికి ఆ జంట పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. అందులో దిగ్భ్రాంతి పాలు ఎక్కువ. ఎక్కువవుతున్నారు వాళ్ళని గమనించేవాళ్ళు. ఎవర్నీ లక్ష్యపెట్టకుండా గొప్ప సంతోషంతో రోజులు గడుపుతున్నారు ఇద్దరూ.

ఇప్పుడు జగన్నాథం నుంచి ఉత్తరం.

రెండు రోజులు డ్యూటీకి సెలవుపెట్టి వూరెళ్ళాడు. దాపరికం ఇష్టం లేదు. తల్లి వరలక్ష్మితో చెప్పాడు శ్వేత అనే అమ్మాయీ, తనూ కలిసి వుంటున్నట్లు. వరలక్ష్మి బిత్తరపోయింది. కంగారు పడిపోయింది. లోకం సంగతి జ్ఞాపకం వచ్చి భయపడింది. ఏవేవో ఆలోచనలు వచ్చాయి. ఆ అమ్మాయిది ఏ కులమో? తమ కులమైతే కొంతలో కొంత నయం. కలిసి వుంటున్నారంటే ఆ పిల్ల తనకేమవుతుంది? కోడలనచ్చా? పెళ్ళయితేనే కదా కోడలయ్యేది. ఓవేళ ఆ పిల్ల ఇక్కడికి వస్తే చుట్టుపక్కల అమ్మలక్కలకి ఏమని పరిచయం చేస్తుంది? కొడుక్కి ఏమవుతుందని చెప్పాలి? స్నేహితురాలనా? ప్రియురాలనా? అదేంది... ఆ రూమ్మేట్ అనా?

కొడుకుపై ఆమెకి కోపం వచ్చింది పీకలదాకా. ఎట్లా ప్రదర్శించాలో తెలీలేదు చప్పున. రోజులు మారిపోతున్నాయి. తరానికీ తరానికీ మార్పు వస్తోంది, వేగంగా. స్పీడు ఎక్కువవుతోంది జీవనంలో. ఒక్కటొక్కటే తెగిపోతున్నాయి కట్టుబాట్ల సంకెళ్ళు. ఇవేవీ అర్థం చేసుకోగల పరిజ్ఞానం లేదు వరలక్ష్మికి.

''పెళ్ళి కాకుండా ఎవతో అమ్మాయితో కల్సి వుండటమేమిట్రా?'' అంది ఆఖరుకి.

''మేం ప్రేమించుకున్నామమ్మా. కల్సి వుండాలని నిర్ణయించుకున్నాం''

''ఆ పిల్లకి ఎవరూ లేరా?''

''ఎందుకు లేరు? అమ్మా, నాన్నా, అన్నా - అంతా ఉన్నారు''

''మరా పిల్ల ఇట్లాంటి పనిచేస్తే వూరుకున్నారా?''

''ఇట్లాంటి పనంటే - ఇది ఘోరమైన పనా. వాళ్ళు వూరుకున్నారో లేదో అక్కడికి వచ్చి శ్వేతనే అడుగు''

''తప్పు కదరా అట్లా వుండటం. నలుగురూ ఏమనుకుంటారు. ఎంత ఎగతాళి అయిపోతాం అందరిలో. గౌరవం, మర్యాదా ఉంటాయా మనకి''

''గౌరవం, మర్యాదా అనేవి మనం వూహించుకునే దాన్నిబట్టి వుంటాయమ్మా. నా దృష్టిలో మేం చేసిన పని యెంత మాత్రమూ తప్పుకాదు. మా ఇద్దరికీ అది ఇష్టమైన పని ఐనప్పుడు ఇంకొకరు మా విషయంలో ఎందుకు తలదూర్చాలి'' అన్నాడు ప్రశాంతంగానే.

అప్పుడే వచ్చాడు జగన్నాథం ఇంట్లోకి. సాధారణంగా చాలా తక్కువగా మాట్లాడతాడతను.

''విన్నారా. వీడూ, ఇంకో అమ్మాయీ కలిసి వుంటున్నారట'' చెప్పింది వరలక్ష్మి.

''నిజమా. ఏరా! అద్దె కల్సి వస్తుందనా?''

వచ్చే నవ్వుని ఆపుకున్నాడు వసంత్ ''లేదు. మేం ప్రేమించుకున్నాం''

''అదేంట్రా. నేను ఉత్తరం రాశాను కదా సంబంధం వచ్చిందనీ, అమ్మాయిని చూసేందుకు రమ్మనీ. అందలేదా?''

''అందింది. అందుకే అట్లాంటి ప్రయత్నాలేవీ అవసరం లేదని చెప్పేందుకే వచ్చాను''

''ఏవిటీ? ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోబోతున్నావా?''

''ఇంకా మేం పెళ్ళి గురించి ఏం అనుకోలేదు''

బిత్తరపోయాడు జగన్నాథం. నోటెంట వెంటనే మాట రాలేదు. కలిసి వుంటున్నామని చెప్తున్నాడు, మళ్ళీ పెళ్ళి మాట మాత్రం అనుకోలేదంటున్నాడు. ఈ రెండింటికీ లంకె ఎట్లా కుదురుతుంది?

''నువ్వంటే మగాడివి. ఎట్లా చేసినా చెల్లుద్ది. పాపం ఆడపిల్ల. ఆ అమ్మాయి బతుకుతో ఆటలాడాలనుకుంటున్నావా?'' బాగా అడిగాననుకున్నాడు.

''ఎవరం ఎవరితో ఆటలాడుకోటం లేదు. ఇద్దరం ప్రేమించుకున్నాం. కల్సి వుండాలనుకున్నాం. నాల్గు నెలల నుంచీ వుంటున్నాం''

''పెళ్ళి చేసుకోకుండా కల్సి వుండేదేంట్రా. ఫలానా జగన్నాథం కొడుకు హైద్రాబాద్‌లో ఎవరో పిల్లని పెట్టుకుని వుంటున్నాడని జనం అనుకుంటే మనకి ఎంత అప్రతిష్ఠగా వుంటుందో ఆలోచించావా?''

''ఇందులో ఆలోచించేందుకేమీ లేదు నాన్నా. నేను మీతో గొడవ పెట్టుకునేందుకు రాలేదు. ఉత్తరంలోనే రాసేవాడిని ఈ సంగతి. స్వయంగా చెబితేనే బాగుంటుందని శ్వేత అంటే వచ్చాను''

మళ్ళీ గట్టిగా వసంత్‌ని అనేందుకు జంకాడు జగన్నాథం. గొణుక్కుంటూ ఉండిపోయాడు. కొడుకుతో మాట్లాడేందుకు మనస్కరించలేదు వరలక్ష్మికి కూడా. కొడుకు ఘోరమైన తప్పు పని చేశాడని ఆమె నమ్ముతోంది. బరితెగించినవాళ్ళు తప్ప ఇట్లాంటి పనులు చేయరని ఆమె అభిప్రాయం.

మరోరోజు సెలవు వున్నా వుండబుద్ధికాక ఆ రోజు రాత్రే బయలుదేరి వచ్చేశాడు హైద్రాబాద్.

★ ★ ★

బాత్‌రూమ్‌లోకి పోబోతూ ఇంటి ముందు ఆటో శబ్దం వినపడ్డంతో ఆగి చూశాడు. ముందు జగన్నాథం, తర్వాత వరలక్ష్మి దిగారు ఆటోలోంచి. ఆశ్చర్యపడ్తూ ఎదురువెళ్ళాడు. ఆటోవాడికి డబ్బులిచ్చి ఇంట్లోకి వచ్చారు.

''నువ్వు అట్లా వచ్చేశాక వుండబట్టలేక వచ్చేశాం'' చెప్పింది వరలక్ష్మి. ఇంట్లోకి అడుగుపెడ్తూనే చుట్టూ కలియజూసింది. గతంలో తను వచ్చినప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పు కన్పించింది.

కొత్త మనుషుల్ని చూడ్డంతోటే వాళ్ళెవరయి ఉంటారో వూహించింది శ్వేత.

''మా అమ్మా నాన్నా... ఈమే శ్వేత'' పరిచయం చేశాడు వసంత్. అప్పటిదాకా మనసులో ఎంతో కోపం వున్నా అందమైన ఆమె నవ్వూ, చొరవగా వచ్చి తన చేతులు పట్టుకోడం... కోపం తగ్గించాయి.

# సంస్కరణ



బుద్ధి యజ్ఞమూర్తి

''ఏమోనమ్మాయ్. నువ్వేన్నయినా చెప్పు. మా ఆయన కంటే నీకెక్కువ తెలుసుంటుందని నేననుకోను. ఎందుకొచ్చిన తగలాటం. పరువు పోవడం తప్ప. మీరిట్లా ఉండటం ఏం బావుంటుంది. మా వాడంటే మూర్ఖుడు. మగాడు కాబట్టి వాడికొచ్చే నష్టంతో పోల్చుకుంటే నీకొచ్చే తిప్పలు చాలా ఎక్కువ. శుభ్రంగా మీ వాళ్ళ దగ్గరికి వెళ్ళిపో. అందరికీ బావుంటుంది''

''టైమవుతోంది వసంత్. స్నానానికి వెళ్ళిరా'' అంది శ్వేత కళ్ళతోనే ఏం ఫర్వాలేదని చెప్తూ. 'వసంత్‌ని అట్లా పేరు పెట్టి పిలుస్తుందేమిటి ఈ పిల్ల, బొత్తిగా మర్యాద లేకుండా. రోజులిట్లా తయారవుతున్నాయేమిటో?' అనుకుంది వరలక్ష్మి.

''మీరు కూర్చోండి. టీ కలుపుకుని తెస్తాను'' అని వంటగదిలోకి వెళ్ళింది. తనూ వెళ్ళింది వెనకాలే - వరలక్ష్మి.

''నువ్వు కాలేజీకి వెళ్తున్నావంట కదమ్మా. అబ్బాయి చెప్పాడు''

''అవునండి. నన్ను కాలేజీ వద్ద దింపి తను ఆఫీసుకి వెళ్తాడు''

''అమ్మాయ్. నాకు తెలీకడుగుతాను. పెళ్ళి చేసుకోకుండా ఇట్లా ఒకే ఇంట్లో వుండటం ఏమన్నా బాగుందా?''

''ఒక ఆడా, మగా ప్రేమించుకొని కలిసి వుండాలని దృఢంగా నిశ్చయించుకున్నప్పుడు పెళ్ళి అవసరం లేదని వసంత్ అభిప్రాయం. మీలాగే మొదట్లో నాకూ అది కష్టమన్పించింది. ఇప్పుడయితే నా భావం మార్చుకున్నాను''

''మా కుటుంబాల్లో ఏ ఒక్క మగాడికీ ఇట్లాంటి ఆలోచనలు లేవు. వీడికే ఇట్లాంటివి ఎందుకు వస్తాయో అర్థం కాదు. చిన్నప్పట్నించీ అంతే. పాలచెట్టు పేరు ఎప్పుడన్నా విన్నావమ్మాయ్. మా ఇంటిపక్క వుండేది ఓ చెట్టు. చాలా రుచిగా ఉంటాయి పాలపళ్ళు. ఆ స్థలం కలవాళ్ళు వాళ్ళవసరం కోసం చెట్టు కొట్టేస్తుంటే అక్కడున్న పిల్లలంతా సంతోషంగా కొమ్మకి వున్న పళ్ళు తెంపుకు తింటుంటే వీడు భోరున ఏడ్చేశాడు చెట్టు కొట్టేస్తున్నారని. పైగా చెట్టు కొట్టేస్తున్న వాళ్ళతో పోట్లాట పెట్టుకున్నాడు. వీడు ఏడుస్తూ అడిగే మాటలకి వాళ్ళు తెల్లముఖం వేశారనుకో. అట్లా వుంటుంది వీడి వరస. సరే ఇంతకీ మీది ఏ కులం అమ్మాయ్?''

ఆమె నోటి నుంచి ఈ ప్రశ్న తప్పకుండా వస్తుందని ముందే గ్రహించింది శ్వేత. తనేం చెప్పినా ఆమె అర్థం చేసుకోగలదన్న నమ్మకం లేదు. తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న కులవ్యవస్థ తాలూకు జీవం నరనరాన ప్రవహిస్తున్న వరలక్ష్మి తన మాటల్ని అర్థం చేసుకుంటుందా?''

''కులం గురించి మీకంత పట్టింపు ఎందుకో తెలుసుకోవచ్చా?''

శ్వేత ప్రశ్నకి విసురుగా చూసింది వరలక్ష్మి. 'ఇంత పెద్దదాన్ని పట్టుకుని తన్నే ఎదురు ప్రశ్న వేస్తుందా ఈ బుడత, బొత్తిగా గౌరవం లేకుండా'

''అదేంటమ్మాయ్. ఏ కులం వాళ్ళకయినా ఆ కులం గురించి పట్టింపు వుండదా. మన పెద్దవాళ్ళు పెట్టిన కట్టుబాట్లని కాదనడానికి మనమెవరం? వాళ్ళు పిచ్చివాళ్ళా?'' వరలక్ష్మి అన్నదానికి నవ్వుతూ చూసింది శ్వేత.

''అసలు కులం ఎందుకు పుట్టిందో తెలిసి ఉంటే మీరిలా అనేవాళ్ళు కాదండీ. కులాలు ఏర్పడకముందు సమాజంలో వర్ణ వ్యవస్థ ఉండేది. బుద్ధుణ్ణి మీరు గొప్పవాడని ఒప్పుకుంటారు కదా. ఆయనే ఈ వర్ణ వ్యవస్థని వ్యతిరేకించాడు''

''కులాలు తెలుసు కానీ వర్ణ వ్యవస్థేమిటి?''

''వర్ణాలంటే - బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులని అప్పుడు నాలుగు వర్ణాల వాళ్ళుండేవాళ్ళు. మిగతా మూడు వర్ణాల వాళ్ళూ శూద్రుల్ని హీనంగా చూసేవాళ్ళు - ఇప్పుడు హిందువులు దళితుల్ని చూస్తున్నట్టు. ఎవరు ఏ వర్ణానికి చెందుతారనేది పుట్టుకనిబట్టే నిర్ణయించే ఈ వర్ణ వ్యవస్థని బుద్ధుడు ఖండించాడు. అయితే అందుకు విరుద్ధంగా బ్రాహ్మణులు వర్ణ వ్యవస్థని జనంలో ప్రచారంలోకి తెచ్చారు''

''బుద్ధుడు ఒప్పుకోకపోతే ఆయన్ని దేవుడిగా కొలిచే జనం మాత్రం ఎందుకు ఈ వర్ణాల్ని పట్టుకున్నారు?'' అడిగింది వరలక్ష్మి, ఈ ప్రశ్నకి జవాబు ఉందా? అని చూస్తూ.

''దానికి పెద్ద చరిత్రే ఉందండీ. కొద్ది మాటల్లో చెప్తాను. ఆ రోజుల్లో సమాజంలో స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ అనేది ఒకటి ఏర్పడింది. దీనివల్ల అంతదాకా సాగుతూ వచ్చిన దూర ప్రాంత వర్తకం దెబ్బతింది. స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ అంటే తమ అవసరాల్ని తామే తీర్చుకునే వ్యవస్థ అన్నమాట. అందుచేత ఈ వర్తకంతో ముడిపడి వున్న బౌద్ధ విహారాలనేవి క్షీణించి పోయాయి. బౌద్ధమతానికి ఉన్న సామాజిక పునాది కూడా పోయింది. ఇక వర్ణాలనేవి స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ అంటే తమ అవసరాల్ని తామే తీర్చుకునే వ్యవస్థ అన్నమాట. అందుచేత ఈ వర్తకంతో ముడిపడి వున్న బౌద్ధ విహారాలనేవి క్షీణించి పోయాయి. బౌద్ధమతానికి వున్న సామాజిక పునాది కూడా పోయింది. ఇక వర్ణాలనేవి స్వయంపోషక గ్రామీణ వ్యవస్థకి అతికాయి కాబట్టే వర్ణవ్యవస్థ వేళ్ళూనుకుపోయింది''

''వర్ణాల గురించి చెబుతున్నావే కానీ కులాల సంగతి చెప్పవేం?''

''వాటి దగ్గరకే వస్తున్నాను. కాలక్రమంలో వర్ణాల స్థానంలోనే కులాలు వచ్చాయి. నాలుగు వర్ణాల మధ్య వర్గ సంకరం జరిగినందువల్ల కులాలన్నీ ఏర్పడ్డాయని మనువు అనే ఆయన ఒక కల్పన చేశాడు. ఆయన కల్పనని తర్వాతి బ్రాహ్మణులు ఓ శాస్త్రంగా కొనసాగించారు. ఫలితంగా ఇప్పుడున్న కులవ్యవస్థ సాగుతూ వస్తోంది'' చెప్పి టీ కలిపింది శ్వేత.

ఆమె చెప్పిందంతా ఆశ్చర్యంగా వింది వరలక్ష్మి. ఆమెకి కొంత అర్థమైంది, కొంత కాలేదు. అయినా ఇంత చిన్న వయసులో ఈ సంగతులన్నీ ఎట్లా తెలిశాయి ఈ పిల్లకి?'' అదే అడిగింది.

''చదువుకోవడం చేత'' చెప్పింది శ్వేత.

నిజమే తను చదువుకోలేదు. అందుకే ఈ సంగతులేవీ తెలీదు. అయితే చదువుకున్న వాళ్ళందరికీ ఈ సంగతులు తెలుసు కదా. ఈ కులాల్లో మంచంటూ లేకపోతే వాళ్ళు ఎందుకు వూరుకుంటున్నారు? కులాల మధ్య పోట్లాటలు ఎందుకు సాగుతున్నాయి? తమ వూళ్ళోనే రెండు కులాల మధ్య గొడవలు వచ్చి ఒకళ్ళనొకళ్ళు కత్తులతోటీ, కటార్లతోటీ పొడిచి చంపుకోడం తనకి తెలుసు. మరెందుకు ఇవన్నీ జరుగుతున్నాయి?

ఆమె సందేహం విని ''ముందు ఈ టీ తీసుకోండి'' అని ఆమెకో కప్పు ఇచ్చి ముందు గదిలోకి వచ్చి జగన్నాథానికో కప్పు ఇచ్చింది.

వసంత్ స్నానం పూర్తిచేసి బట్టలేసుకు వచ్చాడు.

''నువ్వు కూడా రెడీకా'' అన్నాడు శ్వేతని ఉద్దేశించి.

''ఈ రోజు నేను సెలవు పెడుతున్నాను''

శ్వేత వంక ఆశ్చర్యంగా చూశాడు వసంత్. కళ్ళతోనే సందేహ నివృత్తి చేసింది.

''అబ్బాయికి కూడా ఇవ్వమ్మా'' అంది వరలక్ష్మి.

''లేదండీ తను ముందు టిఫిన్ చేశాకే'' చెప్పింది శ్వేత.

ఈ పిల్ల అప్పుడే వసంత్ మీద పెత్తనం చేస్తుందా అన్నట్లు చూసింది వరలక్ష్మి, శ్వేత వంక. వరలక్ష్మి తన గురించి ఏమనుకుంటుందో అప్పుడు, గ్రహించుకుని చిన్నగా నవ్వుకుంది శ్వేత.

వసంత్ ఆఫీసుకి వెళ్ళిపోయాడు. జగన్నాథం టాయ్‌లెట్‌లోకి వెళ్ళాడు. అప్పుడు వరలక్ష్మితో అంది శ్వేత - ''మీరిందాక ఓ సందేహం అడిగారు కదా. చెప్తాను. ప్రతి కులం వారూ తమ కులం మీద విపరీతమైన దురభిమానం పెంచుకున్నారు. తరతరాలుగా ఇది కొనసాగుతూ వస్తోంది. వాళ్ళలో చదువుకున్న వాళ్ళకి కులాలు ఎందుకు పుట్టాయో తెలుసు. అయినా తెలీనట్లే ఉంటారు. అహంభావం అనేది వాళ్ళనట్లా చేస్తుంది. 'ముందు ఎదుటివాడ్ని సంస్కరణకి ఒప్పుకోమను. అప్పుడు నేనూ ఒప్పుకుంటాను' అనే మనస్తత్వం మనది. ఇక కుల నిర్మూలన ఎట్లా సాధ్యమవుతుంది? ప్రభుత్వాలు కూడా కులాన్ని పెంచి పోషిస్తున్నప్పుడు ఇక అది అసాధ్యమనే అనుకోవాలి''

చెప్పి వరలక్ష్మి ముఖంలోకి చూసింది. తాను చెప్పింది ఆమెకి కొంచెం కూడా అర్థమై ఉండదని అన్పించింది. ఆమెతో ఇట్లా సంభాషించడం వృథా అని తోచింది.

''ఏమోనమ్మాయ్. నువ్వేన్నయినా చెప్పు. మా ఆయన కంటే నీకెక్కువ తెలుసుంటుందని నేననుకోను. ఎందుకొచ్చిన తగలాటం. పరువు పోవడం తప్ప. మీరిట్లా ఉండటం ఏం బావుంటుంది. మా వాడంటే మూర్ఖుడు. మగాడు కాబట్టి వాడికొచ్చే నష్టంతో పోల్చుకుంటే నీకొచ్చే తిప్పలు చాలా ఎక్కువ. శుభ్రంగా మీ వాళ్ళ దగ్గరికి వెళ్ళిపో. అందరికీ బావుంటుంది''

వచ్చే కోపాన్ని బలవంతాన అదిమిపెట్టింది శ్వేత.

''ఈ మాటే వసంత్ వచ్చాక అతనితో చెప్పండి'' అంది.

★ ★ ★

కొద్దికాలం గడిచాక జగన్నాథం నుంచి ఇంకో ఉత్తరం వచ్చింది వసంత్‌కి.

''ఒరేయ్! నువ్వు చేసిన పనికి ఇక్కడందరూ ఉమ్మేస్తున్నారు. మా పెంపకం సరిగా లేదు కాబట్టే నువ్విట్లా తయారయ్యావంటున్నారు మీ బాబాయిలూ, మీ మావయ్యలూ. తెలిసిన ప్రతివాడూ వచ్చి 'మీవాడు హైద్రాబాద్‌లో ఎవతెనో ఉంచుకున్నాడంటగా' అంటుంటే నా నెత్తురు ఎట్లా మరుగుతుంటుందో అర్థం చేసుకో. వాళ్ళ తాకిడికి బయటికి వెళ్ళాలంటేనే దడగా వుంటోంది. నువ్వు చేసిన వెధవ పని మీ బావకీ తెలిసి నీ చెల్లెల్ని నానా మాటలూ అంటూ, మన వంశాన్నంతా తిడుతూ కొడ్తూ ఉంటే భరించలేక అది పుట్టింటికి చేరింది. ఎట్లాగో నచ్చజెప్పి మళ్ళీ అత్తగారింటికి తీసుకుపోతే అల్లుడు నన్ను కూడా ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. ఈ జన్మలో మొదటిసారిగా ఒకరి కాళ్ళు పట్టుకోవాల్సొచ్చింది.

దయచేసి నువ్వు ఈ ఛాయలకి రామాకు. ఏ కూస్తో వున్న శాంతి కూడా పోతుంది. నువ్వు పాటిస్తావన్న నమ్మకం లేకపోయినా నాదో సలహా. 'ఎవతెనో ఉంచుకున్నాడు' అనే మాట నీకు బాగానే ఉంటుందేమో కానీ జనానికి ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి కనీసం ఆ పిల్లని పెళ్ళయినా చేసుకుంటే కొంత నయంగా ఉంటుంది.

నీ దయవల్ల మీ అమ్మకి అదే నా భార్యకి అనారోగ్యం అమోఘంగా ఉంటోంది.

-ఇట్లు జగన్నాథం ★